ప్రజాశక్తి

మంగళవారం 25 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

12 ఏళ్లుగా..

నైట్ షెల్టర్ల కాంట్రాక్టు ఒక్కరికే !

- మూడేళ్లకోసారి రెన్యువల్‌కు చెల్లుచీటీ
- జివిఎంసి నిర్వాకంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలో నిరాశ్రయ జీవులను అక్కున చేర్చుకోవడం కోసం ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్ల వ్యవస్థలోనూ అక్రమార్కులు జొరబడి ఆ నిధులను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ఇచ్చిన విరాళాలు, నిధులను 20 నుంచి 30 శాతం మాత్రమే ఖర్చు చేస్తూ మిగతా సొమ్ముతో తమ ఖజానాను నింపుకుంటున్న వైనం ఓ సంస్థ విషయంలో తాజాగా బట్టబయలవుతోంది.

ఇదీ అసలు సంగతి

జివిఎంసి పట్టణ జీవనోపాధుల కేంద్రం నుంచి నైట్‌షెల్టర్ల నిర్వహణను 12 ఏళ్లుగా ఎయుటిడి అనే స్వచ్ఛంద సంస్థకు అధికారులు కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని రెండు నైట్ షెల్టర్లు, బీమ్‌నగర్‌లోని ఒక నైట్ షెల్టర్‌ను ఈ సంస్థ సుదీర్ఘకాలంగా నడుపుతోంది. ప్రతి మూడేళ్లకోసారి సమీక్ష జరిగి ఆ సంస్థ నిర్వహణ బాగుంటేనే రెన్యువల్ చేయడానికి అర్హత ఉంటుంది. అలాంటిది ఈ సంస్థ విషయంలో కానరాలేదు. ఒక ఎయుటిడి కింద నైట్ షెల్టర్‌ను తీసుకుని వాటిని మూడు నైట్ షెల్టర్లుగా రికార్డుల్లో చూపిస్తూ పబ్బం గడుపుకోవడం వెనుక జివిఎంసి సూర్యాబాగ్ సిబ్బంది, అధికారుల సహకారం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఒక షెల్టర్‌లో నలుగురు కేర్ టేకర్‌లు ఉండాల్సి ఉండగా మూడు సెంటర్లనూ ఆరుగురితో నడిపిస్తూ 12 మంది కేర్ టేకర్లకు బినామీల పేరున సంవత్సరాలు తరబడి జీతాలు డ్రా చేస్తున్న విషయంపై నగరానికి చెందిన బందిఖానా చిన్నారావు అనే వ్యక్తి సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌పిసిఎల్, స్టీల్‌ప్లాంట్, ఎన్‌టిపిసి మొదలైన సంస్థల నుంచి ఏటా రూ.లక్షలు విరాళాలుగా వసూలు చేయడంపైనా కలెక్టర్‌కు, జివిఎంసి కమిషనర్‌కు సదరు వ్యక్తి వివరాలను అందజేశారు. ఇంకా ఈ సంస్థ అక్రమాలపై విచారణ ప్రారంభిస్తే పదేళ్లుగా పాత నిరాశ్రయుల పేరుతోనే సంస్థను నడిపిస్తూ జిల్లా అధికార యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న విషయం బట్టబయలు మిగతా 2లో..

షెల్టర్‌లోని నిరాశ్రయులు (ఫైల్ ఫొటో)

విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సమస్యలపై మధ్యాహ్న కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి.వెంకటరావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పోలీసు చర్యలను సిఐటియు, ప్రజా సంఘాల నేతలు ఖండించారు.

కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఎ.సీతాలక్ష్మి, జి.అప్పలరాజు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ వండి, సరఫరా చేయాలని ఇచ్చిన ఆదేశాలను అక్షయపాత్ర సంస్థవారు అమలు చేయడం లేదన్నారు. అక్షయపాత్ర ఉన్న జివిఎంసి వార్డుల్లోనూ, ఆనందపురం, భీమిలి మండలాల్లోనూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులే రాగిజావ వండుతున్నారన్నారు. సదరు సంస్థ వారు కేవలం భోజన సరఫరా మాత్రమే చేస్తున్నట్టు తెలిపారు. కనుక తమకు తక్షణం గ్యాస్, పాత్రలు, పాత్రలు శుభ్రం చేయడానికి సబ్బులు, సర్ఫ్‌లు మిగతా 2లో..

'ఉక్కు' దీక్షలకు కెఎ.పాల్ సంఘీభావం

▶ వార్త మెయిన్‌లో..

కానరాని మొక్కజొన్న కేంద్రాలు

▶ వార్త 3లో..

మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై పోరాటం

▶ వార్త 8లో..

మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెసి విశ్వనాథన్

స్పందనకు వినతుల వెల్లువ

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన అర్జీదారులకు భోజన ఏర్పాట్లు

వార్త 2లో..

ఎయులో ఆధునిక ఓపెన్ ఎయిర్ థియేటర్

రూ.50 లక్షలతో పునరుద్ధరణ - 26న ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా పేరొందిన ఆంధ్ర యూనివర్సిటీలో ఆధునిక ఓపెన్ ఎయిర్ థియేటర్ ఈ నెల 26న అందుబాటులోకి రానుంది. ఎయు రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా దశాబ్దాల క్రితం నుంచీ ఉన్న ఈ ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరగా దీని పునరుద్ధరణ కోసం ఎయు విసి ప్రొఫెసర్ పివిజిడి.ప్రసాదరెడ్డి కొద్ది రోజుల క్రితం చర్యలు చేపట్టారు. దాతల సాయంతో రూ.50 లక్షలు సమీకరించి ఆధునిక సౌకర్యాలతో పనులు పూర్తి చేశారు. త్వరలో ఈ థియేటర్ సరికొత్త అనుభూతిని పంచనుంది.

ఆధునికీకరణ అనంతరం ఎయులోని ఓపెన్ ఎయిర్ థియేటర్

ఎయు ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. నాటక కళకు వేదికగా నిలిచిన దీని పూర్తి పేరు కెవి.గోపాలస్వామి ఓపెన్ ఎయిర్ థియేటర్. నాటకరంగ అభిలాష కలిగిన పూర్వ రిజిస్ట్రార్ కెవి.గోపాలస్వామి ఆలోచన మేరకు 1957లో దీనిని నిర్మించారు. ఇక్కడ ప్రదర్శించే నాటకాలను తిలకించడానికి ఎన్‌టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, ఎస్‌వి.రంగారావు వంటి గొప్ప నటులు వచ్చేవారు. అటువంటి రంగస్థలం కాల గమనంలో కొంత నిరాదరణకు గురైంది. చాట్ల శ్రీరాములు, అబ్బూరి గోపాలకృష్ణ, సాక్షి రంగారావు, వంకాయల సత్యనారాయణ, మిశ్రో, అత్తిలి కృష్ణారావు వంటి నాటక, సినీ రంగ ప్రముఖులు ఈ వేదికను ఆధారంగా చేసుకుని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నైట్ షెల్టర్ల కాంట్రాక్టు ఒక్కరికే !

కానుందని, కొత్త నిరాశ్రయులెవ్వరినీ చేర్చుకోవడం లేదని తన ఫిర్యాదులో చిన్నారావు పేర్కొన్నారు. 2012 నుంచి ఎయుటిడి సంస్థ ప్రతినిధి జివిఎంసిలో చక్రం తిప్పుతూ రూ.కోట్లకు అధిపతి అయ్యాడన్న విమర్శలూ విశాఖలో లేకపోలేదు.

పరిశీలిస్తా : జివిఎంసి యుసిడి పీడీ పాపునాయుడు

'నైట్ షెల్టర్ల నిర్వహణ సమస్య నా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాను' అని జివిఎంసి యుసిడి పీడీ పాపునాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఎయులో ఆధునిక ఓపెన్ ఎయిర్ థియేటర్

ఎదిగారు. హుదూద్ తుపాను సమయంలో ఈ థియేటర్ దెబ్బతింది. ఇంతకాలానికి రూ.50 లక్షలు వెచ్చించి పునర్నిర్మించారు. వేదికను 24 అడుగుల ఎత్తులో రెండంతస్తుల బ్యాక్ స్టేజీతో సిద్ధం చేశారు. కళాకారులకు ఉపయుక్తంగా వేదికకు ఇరువైపులా గ్రీన్ రూమ్స్ నిర్మించారు. రంగస్థలంపై వివిధ ప్రకృతి సిద్ధ సన్నివేశాలను ప్రదర్శించడానికి ఆధునిక పద్ధతిలో ఏర్పాట్లు చేశారు. పాత సీటింగును పూర్తిగా తొలగించి, అనువైన రీతిలో సీటింగ్ ఏర్పాట్లు సమకూర్చారు. వేదికపై కళాకారులకు ఉపయుక్తంగా ఒక టాయిలెట్ బ్లాక్‌ను, వేదికకు పక్కనే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా మరొక టాయిలెట్ బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. ఎలివేషన్, గ్రిల్స్ ఏర్పాట్లు ఉన్నాయి. వర్షం కురిసిన సమయంలో నీరు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించారు. అందమైన పద్ధతిలో ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టారు. నెక్కంటి సీఫుడ్స్, కోరమండల్ పెయింట్స్ సంస్థలు అందించిన సిఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన వేదిక ఎదురుగా 600 మంది వరకు ప్రేక్షకులు కూర్చొని కార్యక్రమాలను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం గతంలో ఉన్న విధంగా సిమెంట్ బెంచీలను నాణ్యతతో నిర్మించారు.

కళలకు ప్రోత్సాహం

విద్యార్థులను విద్యతో పాటు కళలు, క్రీడల్లో కూడా ప్రోత్సహించేలా ఎయు అధికారులు కృషి చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఉపయుక్తంగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నెల 26న జరగనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 98వ వ్యవస్థాపక దినోత్సవం రోజున ఈ థియేటర్‌ను పున్ణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎయు రంగస్థల, సంగీత, నృత్య విభాగాల విద్యార్థుల ప్రదర్శనలతో పాటు నగరంలో సాంస్కృతిక కార్యక్రమాల వేదికగా దీనిని వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు.

సమస్యలపై మధ్యాహ్న కార్మికుల ధర్నా

ఇవ్వాలని, వేతనాలు పెంచాలని కోరారు. కోడి గుడ్లు ఉడకబెడుతున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక గుడ్డుకు ఇస్తున్న 10 పైసలును కూడా ప్రతి నెలా ఇవ్వడం లేదన్నారు. హై స్కూల్, అప్పర్ ప్రైమరీ స్కూల్, ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒకే ఒక్క మిడ్డేమీల్ వర్కర్‌ను జివిఎంసి పరిధిలో నియమించడం వల్ల పనిభారం పడుతోందన్నారు. కేవలం రూ.3 వేలు వేతనం మాత్రమే ఇస్తుండటంతో బతకడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వెలుబుచ్చారు. మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని, శనివారం రాగిజావ, చక్కెర పొంగలి, పప్పుచారు, ఆకుకూర అన్నంగా వున్న మెనూ మార్చి పని భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకులు రాము, వరలక్ష్మి, కళా చందన, ఎన్‌సి కాళి, అన్నవరం, సత్యవతి, సుబ్బలక్ష్మి, కనకరత్నం, వై.లక్ష్మి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

టైమింగ్స్ అమలు చేయకపోవడంపై అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంగన్‌వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వం నిర్దేశించిన టైమింగ్స్‌ను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తులసి, ఎల్.దేవి డిమాండ్ చేశారు. జిల్లాలో టైమింగ్స్ అమలు చేయకపోవడంపై సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం.. మధ్యాహ్నం ఒంటి వరకు మాత్రమే తాము అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాలని, అధికారులు దానికి భిన్నంగా వ్యవహరిస్తూ మూడు గంటల వరకు ఉండాలని చెబుతున్నారని తెలిపారు. వేసవి ఎండల తీవ్రత వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి, కోశాధికారి కె.పద్మావతి పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : జిల్లాలో ప్రజల నుంచి వచ్చే స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలిసి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. 189 విజ్ఞప్తులు అందాయి. అనంతరం జెసి మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విజయనందపురం భూమిపై ఫిర్యాదు

పద్మనాభం మండలం నేరేల్లవలస పంచాయతీ విజయనందపురం గ్రామంలోని సర్వే నెంబరు 17/4, 18, 20/1, 20/2ల్లోని సుమారు 14 ఎకరాలా 19 సెంట్లు భూమిపై గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ సారిక అప్పారావు కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ విభాగంలో ఫిర్యాదు చేశారు. విజయనగరం, విశాఖపట్నంకు చెందిన ఎఎస్ స్టీల్స్ యాజమాన్యం పంపిన గూండాలు తమ గ్రామంలో స్వైరవిహారం చేస్తున్నారని సారిక బుజ్జిబాబు, నాగభూషణం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

మెట్లు ఏర్పాటు కోసం వినతి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, పేదవారితో సంఘాలు ఏర్పాటు చేసి వారి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య కార్యక్రమాలపై ముందుకు వెళ్లడం, మురికివాడల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తమ కార్యాలయానికి మెట్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ సాగరతీర కలంజియా సమాఖ్య కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టర్‌కు, జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వృద్ధుల సౌకర్యం కోసం తాము మెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గతంలో తాము ఏర్పాటు చేసుకున్న మెట్లపై కొందరు గిట్టని వారు చేసిన ఫిర్యాదును గుర్తు చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన భోజన ఏర్పాట్లు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందనకు వచ్చే అర్జీదారులకు, వారి సహాయకులకు వేసవి దృష్ట్యా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. సోమవారం అర్జీదారులకు ఆయన భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డయల్ యువర్ మేయర్‌కు 20, స్పందనకు 83 అర్జీలు

'డయల్ యువర్ మేయర్'కు 20, 'స్పందన'కు 83 అర్జీలు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో పై రెండు కార్యక్రమాల్లో జివిఎంసి అదనపు కమిషనర్ వై శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 64 విజ్ఞప్తులు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన పోలీసు స్పందనకు 64 ఫిర్యాదులు అందాయి. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలకు సంబంధించినవే ఫిర్యాదుల్లో అత్యధిక భాగం ఉన్నాయి.

సుబ్బారావు సేవలు మరువలేనివి

మాట్లాడుతున్న జివిఎంసి ఎడిసి సన్యాసిరావు

సంస్మరణ సభలో జివిఎంసి ఎడిసి సన్యాసిరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిరంతరం కార్మికుల కోసం పనిచేసిన గొల్లపల్లి సుబ్బారావు చరితార్థుడని, కార్మికులకు ఆయన చేసిన సేవలను ఎవ్వరూ మరిచిపోలేరని జివిఎంసి ఎడిసి సన్యాసిరావు కొనియాడారు. ఇటీవల మరణించిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి సుబ్బారావు సంస్మరణ సభ సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముందుగా సుబ్బారావు చిత్రపటానికి సన్యాసిరావుతో పాటు పలువురు కార్మిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎడిసి సన్యాసిరావు మాట్లాడుతూ సుబ్బారావు కార్మికుల పనుల కోసం తమ వద్దకు వచ్చినప్పుడు కార్మికులకు మంచి జరగాలని, వారికి రావలసిన అన్ని హక్కులూ కల్పించాలని కోరేవారని చెప్పారు. ఆయన చాల దృఢ నిశ్చయం, పట్టుదల కలిగిన గొప్ప నేతని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం కార్మికులకు తీరని లోటని అన్నారు. సభకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు బి.వెంకటరావు, సుబ్బారావు సతీమణి జి.మణి, సీర రమణ, జెఆర్.నాయుడు, ఇ.ఆదినారాయణ, అప్పలరాజు, ఎం.ఈశ్వరరావు, మీనాక్షి, గణేష్ పాల్గొన్నారు.

753వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారానికి 753వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు, ఎస్.రామగోపాల్, ఎ.ఈశ్వరరావు, రజక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు పివి.రమణ పాల్గొన్నారు.

పిజ్జా హట్‌లో 10 కొత్త రుచులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో ప్రజాధరణ కలిగిన పిజ్జా హట్‌లో వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు మరో పది కొత్త రుచుల్లో పిజ్జాలను పరిచయం చేసినట్టు పిజ్జా హట్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనందిత దత్తా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిజ్జా హట్ దేశంలో 800 దుకాణాలతో 199 నగరాలలో విస్తరించి ఉందని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - రావాడ

రేఖా నెం. 09/2023 — **టెండరు నోటీసు** — **తేదీ.21-04-2023**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయితీలో 2023-24 సంవత్సరమునకు గాను పంచాయితీ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిపై పారిశుధ్యం పనులకు నలుగురు, ఎలక్ట్రిషియన్‌కు ఒకరిని, ఎలక్ట్రిషియన్ హెల్పర్ ఒకరిని, గ్రామపంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్ ఒకరిని, 11 మంచినీటి సరఫరా ట్యాంకులకు పంపు ఆపరేటింగ్ మరియు క్లీనింగ్ నిమిత్తం ఇద్దరు పంపు ఆపరేటర్లుని గ్రామపంచాయితీ కార్యాలయంలో శుభపరుచుటకు ఒక ఆయాని మరియు వీధికుక్కలను సురక్షితంగా పట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను, టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీలు వేసిన టెండర్లు తేది: 28-04-2023 ఉదయం గం.12.00ల వరకు తీసుకొని అదేరోజు హాజరైన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో టెండరు తెరువబడును. టెండరు దాఖలు చేయు వ్యక్తులు నెల మనిషికి ఒకరికి రేటు తెలుపవలెను. అదే విధముగా కింద తెలుపబడిన వరుస సంఖ్య 6లో గల వీధి కుక్కలను సురక్షితంగా పట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను కుక్క ఒక్కంటికి రేటు తెలుపవలెను. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని ఈ క్రింది సంతకందారుని యొక్క అధికారికి కలదు.

క్రమ సంఖ్య	పని పేరు	కాలపరిమితి	ధరావత్తు పోస్ట్ 1కి
1.	శానిటేషన్ పని వారు-4	01-05-2023 టు 31-03-2024	రూ. 200/-
2.	ఎలక్ట్రిషియన్-1, ఎలక్ట్రిషియన్ హెల్పర్-1	01-05-2023 టు 31-03-2024	రూ. 200/-
3.	గ్రామపంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్-1	01-05-2023 టు 31-03-2024	రూ. 200/-
4.	పి.డబ్ల్యు.ఎస్. స్కీం11కి పంపు ఆపరేటింగ్ మరియు ట్యాంక్ క్లీనింగ్-2	01-05-2023 టు 31-03-2024	రూ. 200/-
5.	గ్రామ పంచాయితీ కార్యాలయం శుభపరుచుటకు ఆయా-1	01-05-2023 టు 31-03-2024	రూ. 200/-
6.	వీధికుక్కలను సురక్షితంగా పట్టి కుటంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు	2023-2024 సం॥ (కుక్క ఒక్కంటికి రేటు)	రూ. 200/-

సం/- జె.అనూరాధ, పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, రావాడ, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా.

స్పందనకు 14 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నిర్వహించిన స్పందనకు పలు సమస్యలపై 14 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి 3, ఇంజినీరింగ్ విభాగానికి 9, యుసిడి, రెవెన్యూ విభాగాలకు చెరొక అర్జీ అందాయి. తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు అర్జీలు పంపినట్లు జోనల్ కమిషనర్ రాము తెలిపారు.

సచిన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : క్రికెటర్ సచిన్ టెండుల్కర్ జన్మదిన వేడుకలు సోమవారం అజ్జు ఎలెవెన్, ఎస్ఎంకెసిసి టీం ఆధ్వర్యాన చినగదిలిలో నిర్వహించారు. అభిమానుల నడుమ టెండుల్కర్ జన్మదిన కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మురళీరఘు, ఒమ్మి వెంకీ, పీతన శ్రీను, షాను జాన్సన్, ఒమ్మి రాంబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ డివి సుబ్బారావు జయంతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుర్రపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయం సంయుక్తంగా విశాఖ మాజీ మేయర్ డివి సుబ్బారావు 91వ జయంతిని ఘనంగా నిర్వహించారు. డివి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా న్యాయవాది, సామాజిక సేవకులు డివి.శర్మాజీ మాట్లాడుతూ, డివి.సుబ్బారావు సామాజిక సేవా దృక్పథంతో విశాఖలో ఎన్నో మంచి పనులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, ఎం.అప్పలనారాయణ, హంస మహేష్, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం :కొత్త ఎలక్ట్రికల్ విద్యుత్ లైన్లు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆనందపురం ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దిపాలెం, బీపీ కల్లాలు, చందక, గొట్టిపల్లి, కుసులవాడ పంచాయతీల్లో గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలందరూ గమనించి సహకరించాలని కోరారు.

'చందనోత్సవం వ్యాపారమయం'

ప్రజాశక్తి-సింహాచలం: చందనోత్సవాన్ని ప్రభుత్వం వ్యాపార కేంద్రంగా మార్చేసిందని, 6000 టికెట్లు ముద్రించామని చెప్పి రూ.1500 టికెట్లను 20 వేలకు పైగా విక్రయించారని జనసేన భీమిలి నాయకులు పంచకర్ల సందీప్ ఆరోపించారు. రూ.1500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. చందనోత్సవం రోజు భక్తుల అవస్థలు, అనర్థాలను మన్నించమని కోరుతూ సోమవారం సింహాచలం తొలిపావంచ వద్ద పసుపు, కుంకుమ పవిత్ర జలాలతో స్వామివారి విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం సందీప్ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అప్పన్న నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులకు వైసిపి ప్రభుత్వం నైజం కనబడిందన్నారు. తీవ్ర అవస్థలు పడిన భక్తులు అదే సమయంలో వచ్చిన మంత్రి కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణను నిలదీస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆరోపించారు. మిమ్మల్ని ఎవరు రమ్మన్నారని మంత్రులు అనడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు.

కానరాని మొక్కజొన్న కేంద్రాలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఈ ఏడాది పంట చేతికొచ్చినా ఇంకా మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఎక్కడా కానరావడంలేదు. ప్రభుత్వాలు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తుంటాయి. ప్రస్తుత సీజన్‌లో అన్ని గ్రామాల్లో మొక్కజొన్న పంట కోత దశలో ఉంది. రైతు పంటను కోసి అమ్మడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఎక్కడా కానరావడంలేదు. దీంతో తయారైన మొక్కజొన్న పంటను రైతులు కొంత పోలంలో నెట్టీలు వేసి ఉంచుతున్నారు. సాయంత్రం సమయాల్లో వాతావరణంలో మార్పులు వచ్చేసరికి రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పలువురు రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారం రోజులుగా దళారులు క్వింటాకు రూ.2 వేలు ప్రకటించి ప్రస్తుతం రూ.1800కు కొనుగోలు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా తూకంలో కూడా మోసాలకు పాల్పడుతున్నారని రైతులు చెబుతున్నారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో వారికే అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, బాందేవపురం, గంధవరం, పద్మనాభం, రెడ్డిపల్లి, క్రిష్ణాపురం, పాండ్రంగి, తునివలస గ్రామాల్లో మొక్కజొన్న పంట సిద్ధంగా ఉంది. పంట కొనుగోలుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటుచేయకపోయినా కనీసం ప్రతిపక్షాలు గొంతెత్తడంలేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రైతుల ఆందోళన

సిద్ధమైన మొక్కజొన్న పంట

ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : జగనన్న కాలనీలకు 2020లో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో తునివలస, నర్సాపురం గ్రామాల పరిధి సర్వే నెంబర్ 74.91లో తీసుకున్న భూముల్లో అక్రమాలు జరిగాయంటూ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన 10 మంది రైతులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారుల అండదండలతో స్థానిక జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, అతని కుటుంబ సభ్యులు బినామీలపై రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని వివరించారు. సుంకర గిరిబాబుకు తండ్రి నుంచి దఖలు పడిన సుమారు 30 నుంచి 40 ఎకరాలు భూమి ఉందని, దీంతో పాటు ఒక గ్యాస్ ఏజెన్సీ, రెడ్డిపల్లి పంచాయతీలో రూ.కోటి పైబడిన విలువ కలిగిన నివాసం, రెండు కార్లు ఉన్నాయని తెలిపారు. తాము జీవనోపాధి నిమిత్తం విజయవాడలో నివాసముంటున్నామని, తునివలస, నర్సాపురం గ్రామాల్లో లేకపోవడంతో తమ భూములను సుంకర గిరిబాబు అక్రమంగా బినామీల పేర్లు మీద నమోదు చేయించుకున్నారని వివరించారు. తమ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పు చేసిన వారికే ఆర్‌డిఒ మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. విచారణాధికారులను మార్పుచేసి మరలా తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో విచారణ చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో తునివలస, నర్సాపురం గ్రామాలకు చెందిన రైతులు వాడపల్లి నారాయణమ్మ, వాడపల్లి కృష్ణవేణి, వాడపల్లి జయలక్ష్మి, వాడపల్లి లక్ష్మి, రెడ్డిపల్లి అమ్మాజీ, వాడపల్లి గంగాధరరావు ఉన్నారు.

సుపరిపాలనలో రాష్ట్ర స్థాయి అవార్డు

సర్పంచ్ ఛాయాగౌతమికి పురస్కారం అందిస్తున్న సూర్య కుమారి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం గ్రామ పంచాయతీకి 'సుపరిపాలన కలిగిన గ్రామ పంచాయతీ' విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో ఉత్తమ పంచాయతీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఏపి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపిక చేశారు. విజయవాడలో రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్య కుమారి ద్వారా సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి సోమవారం అందుకున్నారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అంశంపై కూడా జిల్లా స్థాయిలో ఇదే పంచాయతీ ఎంపికైంది. పంచాయతీ కార్యదర్శి శంకర్ జగన్నాథ్ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాపు నాడు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : కాపునాడు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక సరస్వతి మందిరం వద్ద పి.బాల మాస్టారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చెల్లూరి గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ప్రగడ సత్యనారాయణ (చంటి), కోశాధికారిగా నాగిరెడ్డి వెంకటస్వామి, మరో 12మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గౌరినాయుడు మాట్లాడుతూ, సంఘం ఐక్యతకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాపు నాడు సంఘం ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కాపునాడు సంఘం ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

మిక్సర్ లారీ బోల్తా

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక నుంచి అడవివరం వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో కాంక్రిట్ మిక్సింగ్ చేసే భారీ వాహనం బోల్తాపడింది. ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ కథనం ప్రకారం... సోమవారం ఉదయం అడివివరం నుంచి హనుమంతువాక వైపు వస్తున్న మిక్సర్ లారీ రామకృష్ణాపురం దాటిన తరువాత ఒక్కసారి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అటువైపు వస్తున్న వాహనాలు నిల్చిపోయాయి. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ ఆధ్వర్యాన సిబ్బంది బోల్తాపడిన లారీని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గోవుల తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెందుర్తి : రాంపురం గ్రామంలో నేషనల్ హైవే వంతెన వద్ద నెంబర్ ప్లేట్ లేని డిసిఎం వ్యాన్‌లో అక్రమంగా సుమారు 60 గోవులను తరలిస్తున్నారని స్వామి సాయిదత్త లోకేశ్వరానంద మహారాజ్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గోనిషేధ చట్టాలు ఉన్నా సరే రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి దానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. గతంలో పెందుర్తిలో నాలుగు సార్లు గోవులను తరలిస్తుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ఈ గోవుల అక్రమ రవాణా వెనుక నాయకుల హస్తం ఉందని ఆరోపించారు.

'పంచ గ్రామాల సమస్యపై పాసర్లకు మాట్లాడే అర్హత లేదు'

ప్రజాశక్తి-సింహాచలం: పంచగ్రామాల భూ సమస్యపై మాట్లాడే అర్హత పాసర్ల ప్రసాద్‌కు లేదని వైసిపి నాయకులు లంక సత్తిబాబు, సిరిపురం కృష్ణ, సాడి మధురెడ్డి, నర్సల అప్పారావు పేర్కొన్నారు. 1996లో టిడిపి నాయకుల మధ్య సమన్వయ లోపంతో పెందుర్తి, చిన్న గదిలి తహశీల్దార్ల ద్వారా దేవస్థానానికి అప్పగించేశారని, అప్పటి నుంచి 14 ఏళ్లు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం పంచ గ్రామాల ప్రజల మనోభావాలతో ఆడుకుందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రతి సందర్భంలోనూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తున్నారని తెలిపారు.

గీతంలో ప్రపంచ మేధోహక్కుల దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ మేధోహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగపూర్‌లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ మేనేజ్‌మెంట్‌తో కలిసి నిర్వహించిన ఆన్‌లైన్ వర్క్‌షాపులో ఐపిఆర్ నిపుణుడు, పేటెంట్స్ అండ్ డిజైన్స్ విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ డాక్టర్ భరత్ ఎన్. సూర్యవంశీ ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలకు తప్పనిసరిగా మేధోహక్కులు పొందాలని సూచించారు. విశ్వవిద్యాలయాలలోని పరిశోధకులు తమ ఆవిష్కరణలను రీసెర్చ్ పబ్లికేషన్స్ కంటే ముందు పేటెంట్ హక్కులు పొందడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేటెంట్ హక్కులతో పాటు భౌగోళికంగా ప్రాధాన్యత గల అంశాలను ఐపిఆర్ పరిధిలోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. తిరుపతి లడ్డు, బెంగాలీ రసగుల్లా, డార్జిలింగ్ టీ వంటివి సహితం ఐపిఆర్ ద్వారా నమోదు అయ్యాయని తెలిపారు. పుస్తక రచనలకు, డిజైన్లు, పెయింటింగ్‌లకు, సంగీతానికి కాపీరైట్ పొందడం అవసరం అన్నారు. గతంలో కంటే ప్రస్తుతం ఐపిఆర్ విధానాలు సరళీకృతం అయ్యాయని వెల్లడించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆవిష్కరణల ద్వారా వాణిజ్య ప్రయోజనాలను పొందాలంటే పేటెంట్ అవసరం అని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు మాట్లాడుతూ, న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు ఐపిఆర్ చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా పారిశ్రామిక వేత్తల ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో వారికి సహితం ఐపిఆర్‌పై అవగాహన అవసరమన్నారు. గీతం రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య మెరుగైన సంబంధాలు నూతన ఆవిష్కరణలకు దారి తీస్తాయన్నారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ లా అసిస్టెంట్ ప్రొఫెసర్ చిత్ర సక్సెన సంధాన కర్తగా వ్యవహరించారు.

శ్రీలక్ష్మీదేవి జాతర పనులు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధి స్వతంత్రనగర్ శ్రీలక్ష్మీదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ జాతరకు సంబంధించి ముహూర్తపురాటను సోమవారం వేశారు. ఆలయ అధ్యక్షులు వాసుపిల్లి బండియ్య పర్యవేక్షణలో కార్యదర్శి బాలుపాత్రో, శ్వేత దంపతులచే ఆలయ ప్రధానార్చకులు పూలఖండం గౌరీప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కార్యదర్శి బాలుపాత్రో మాట్లాడుతూ, ఏటా శ్రీలక్ష్మీ దేవి అమ్మవారి జాతరను ఏప్రిల్ 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జివిఎంసికి ఆటోలో వచ్చిన మేయర్ హరివెంకటకుమారి

కాలుష్య నియంత్రణకు సహకరించాలి

- జివిఎంసికి ఆటోలో చేరుకున్న మేయర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కాలుష్య నియంత్రణకు అన్ని వర్గాలూ సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. జీవీఎంసీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆమె తన సొంత వాహనం వదిలి ఆటోలోనే జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని 'డయల్ యువర్ మేయర్', 'స్పందన' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలూ ముగించుకుని విద్యుత్ వాహనంలో తిరిగి ఆరిలోవని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. వారానికి ఒకరోజైనా అందరూ తమ వాహనాల్ని పక్కన పెట్టి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు, అధికారులు తీరుపై ఆగ్రహం

మేయర్ ఆటోలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నప్పుడు చుట్టుపక్కల భారీ స్థాయిలో ఉద్యోగులు, అధికారుల వాహనాలు పెట్టేయడంపై ఆమె మండిపడ్డారు. ఉద్యోగులు, అధికారులు తమ సొంత వాహనాల్ని వదిలి ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని జీవీఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో ఒకరోజు బస్సు, ఆటో, సైకిల్‌పైనే జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఉద్యోగులు చేరుకోవాలని, అలా కాని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిసి డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు తదితరులు

సిసి డ్రెయిన్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు పరిధి రైల్వే న్యూకాలనీలో శ్రీశ్రీశ్రీ పరదేశమ్మ ఆలయం ఎదురు వీధిలో రూ.20 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి కార్పొరేటర్ ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు ఆధ్వర్యాన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా పరదేశమ్మ అమ్మవారు ఆలయానికి కెకె.రాజు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 42వార్డు వైసిపి అధ్యక్షులు షేక్ జుబేర్, నాయకులు ప్రసాద్, నాగమణి, డిఇ భరణి, గాలి ప్రసాద్, యడ్ల శ్రీనివాసరెడ్డి, గౌరీ, కృష్ణవేణి, షాజహాన్, మాధవ్, గణేష్, నూకరాజు, రమణమూర్తి, శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎస్‌కె మెలోడీస్ ఆధ్వర్యాన నిర్వహించిన మూడు గంటల సినీ సంగీత విభావరి ప్రేక్షకులను మెప్పించింది. 'మాస్టారు మాస్టారు మా మనసు గెలిచారు' అనే శీర్షిక నిర్వహించిన ఈ సినీ సంగీత విభావరిని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, కళా రంగ ప్రముఖులు పల్లా వెంకటేష్, రమణమూర్తి, బొమ్మిడి సత్యనారాయణ, నాగరాజు తదితరులు ప్రారంభించారు. నాగులపల్లి వెంకటేశ్వర ప్రారంభ గీతంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు మను పల్లా, వివిఎన్ మూర్తి, సత్యనారాయణ, రాంబాబు, వి.రామ్ కుమార్ తదితరులు ట్రాక్‌పై వివిధ గీతాలను ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో బాబ్జి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజెలు.. వేసవిలో ఉపశమనం

చక్కెర, మినరల్స్ పుష్కలం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవిలో తాటి ముంజెలకు భలే డిమాండ్ ఉంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పవచ్చు. వేసవిలో ముఖంపై వచ్చే మొటిమలకు విరుగుడు ఈ తాటి ముంజెలు. శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహద పడతాయి. ఇవి తినడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు ఐరన్, పొటాషియం, జింక్, ఫాస్పరస్ వంటివి పుష్కలంగా ఉండడంతో ఆరోగ్య పరంగా ఎంతో ఉపయోగపడతాయి. శరీర బరువు తగ్గదలకూ ఉపకరిస్తాయి.

కష్టంతో కూడిన పని..

తాటికాయల నుంచి ముంజులను తీయడంలో నైపుణ్యంతో పాటు శరీరక శ్రమ ఇమిడి ఉంటుంది. గీత కార్మికులు అనేక కష్టాలు పడుతూ వీటిని తీసి అమ్ముతుంటారు. అయితే వీరికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. తాటి కాయలు తీసే క్రమంలోనూ, చెట్టు ఎక్కి దిగిన సందర్భంలోనూ మెలుకువలు పాటించాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే గీత కార్మికులు ఎంతో సాహసం చేయాల్సి ఉంటుంది.

తాటి కాయల్లో రకాలు...

తాటి కాయల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. ఉప్పర తాటి, కుంచాల తాటి, గజ తాటి, నల్ల కాయల తాటి ముంజెలు ఎంతో శ్రేష్టమైనవి.

ఆరోగ్యానికి మేలు...

తాటి ముంజెలు తింటే శరీరానికి కావాల్సిన చక్కెర, మినరల్స్‌ను పుష్కలంగా అందిస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే కాల్షియం, ఐరన్ తక్షణ శక్తికి దోహదపడతాయి. ఎండా కాలంలో వేడికి సాధారణంగా మల బద్ధకం ఏర్పడుతుంది. ఈ సమయంలో తాటి ముంజెలు తింటే మల బద్ధకం తగ్గుతుంది.

దాక్టర్ పెరుమాళ్
భీమిలి

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఈ నెల 30న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం బాధ్యులు దండు నాగేశ్వరరావు, ఎల్లాజీ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మే డే సందర్భంగా నగరంలోని కార్మికులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులలో కళా ప్రావీణ్యం కలవారందరినీ ఒక దగ్గరకు చేర్చి 30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక పండుగ వాతావరణంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, తప్పెట గుళ్ల, ఏకపాత్రాభినయాలు, ఫ్లూటు తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రి, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా యూనియన్ల అనుబంధాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా పాల్గొనవచ్చని తెలిపారు. ప్రదర్శించే ఏ కళారూపమైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వరంగసంస్థల పరిరక్షణ, దేశభక్తి, దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం, సామాజిక న్యాయంపై ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన కళాకారులు కోలాటం, శ్రామిక గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయాలు, అభ్యుదయగేయాలు, లఘునాటికలు ప్రదర్శిస్తామని ముందుకు వచ్చారని చెప్పారు. విశాఖ నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో కళా ప్రావీణ్యం ఉండి, పాల్గొన దల్చుకున్న వారంతా ఈ నెల 25వ తేదీ లోగా తమ ఎంట్రీలను 9490750661, 9490098794 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు. పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేశ్వరరావు తదితరులు

తూర్పులో 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు వైసిపి కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన ప్రారంభించిన దిగ్విజయం కావడం పట్ల ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ఇది ప్రధాన సంకేతమని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, నాయకులు అక్కరమాని వెంకటరావు, మొల్లి అప్పారావు, దుర్గారావు, పుక్కిళ్ళ ధనలక్ష్మీశంకర్, ఆళ్ల శివగణేష్, మువ్వల సురేష్, మువ్వల లక్ష్మి, గేదెల నాగరాజు, అక్కరమాని రోహిణి, వుమ్మిడి దాసు, కోరుకొండ స్వాతిరత్నదాస్, సూరాడ లక్ష్మి, పందిరి భాయ్, పీతల గోవింద్, పోలిరెడ్డి, జగుపిల్ల అప్పలరాజు, గుడ్ల సత్యారెడ్డి, గరికిన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు నిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు ఎంఆర్‌సి గ్రూప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మరెడ్డి రాంబాబు నిధులను అందించారు. తమ సంస్థ పేరుతో ఏయూలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుచేయాలని కోరుతూ లేఖను, చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు అవసరమైన నిధులను సైతం చెక్ రూపంలో ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డికి అందజేశారు. సోమవారం ఉదయం వీసీ ప్రసాదరెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుచేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని కొమ్మరెడ్డి రాంబాబు పేర్కొన్నారు. ఏయూలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు ముందుకువచ్చిన ఎంఆర్‌సి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, ది కనకమహాలక్ష్మి కో ఆప్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ కొమ్మరెడ్డి రాంబాబును వర్సిటీ తరపున వీసీ అభినందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యులు ఆంజనేయవర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని తెలుసుకునేందుకే...

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తెలుసుకునే విధంగా 'మా నమ్మకం నువ్వే జగన్ మెగా పీపుల్స్ సర్వే'ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు తెలిపారు. ఈ సర్వే సుమారు కోటి కుటుంబాలకు చేరువైందని పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయాలు, ప్రతి 50 ఇళ్లకూ వాలంటీర్లను ఏర్పాటుచేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతి ఒక్కరి నుంచి అభిప్రాయం తీసుకున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. మరో మూడు నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సెల్ఫీ ఫోటోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సారిపిల్లి గోవింద్, కె.అనీల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ళ లీలావతిశ్రీనివాస్, ఉష్రశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ వివరాలను వెల్లడిస్తున్న కెకె.రాజు

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తే సహించం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని కేంద్ర మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని, అదే చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని గొర్లి ధర్మవరం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్ళి కూలీలతో మాట్లాడారు. పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి రూ.2.40 లక్షల కోట్లు ఉన్న బడ్జెట్‌ను నేడు కుదించిందని, దీనివలన ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రూ.600 రోజు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును ఆదాని, అంబానీలకు ఎనిమిదేళ్ల కాలంలో పన్నెండు లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీలు చేశారని తెలిపారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, ఉపాధి కూలీలు రవణమ్మ, రమణమూర్తి ,అప్పల నరసింహ, చిరంజీవి పాల్గొన్నారు.

రేఖవానిపాలెంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు, సిఐటియు నేత గనిశెట్టి

పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ రేఖవానిపాలెం కొత్త చెరువులో ఉపాధి కూలీలు, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీలకు సమ్మర్ అలవెన్స్, గుణపాము, పార, తట్ట, మంచినీటికి పాత పద్ధతుల్లో డబ్బులు చెల్లించాలని, మాస్టర్ విధానం పాత పద్ధతిలో కొనసాగించాలి, పే షిప్పులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు, మంచినీళ్ల సౌకర్యం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు సంఘం నాయకులు భారతి, సుధా, లక్ష్మి, పద్మ, పార్వతి పెద్ద ఎత్తున ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

రూ.9 కోట్లకు పెరిగిన వార్షిక టర్నోవర్

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట, మండలం వడ్డాది పిఎసిఎస్‌లో ఇటీవల మృతి చెందిన సభ్య రైతుల కుటుంబాలకు మంజూరైన బీమా పరిహారాన్ని అధ్యక్షుడు దొండా సన్యాసిరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ళ పైబడిన వారికి రూ.15వేలు, 60 ఏళ్ళ లోపు వారికి రూ.30 వేలు బీమా పరిహారం అందిస్తున్నామని తెలిపారు. అంత్యక్రియల తక్షణ సాయంగా రూ.4వేలు చొప్పున పది మందికి అందజేశామని చెప్పారు. ఈ ఏడాది పిఎసిఎస్ వార్షిక టర్నోవర్ రూ.9 కోట్లకు పెరిగిందన్నారు. రూ.50 లక్షలు బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేశామని తెలిపారు. సభ్య రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బోర్డు డైరెక్టర్ కోవెల ఈశ్వరరావు, పి.కాశి, వైసిపి నేతలు వీర్ల సురేష్, కుబిరెడ్డి వెంకట్రావు, వేతన కార్యదర్శి శాంతి పాల్గొన్నారు.

వాడిన పురుగుమందు డబ్బాలను పూడ్చివేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పంటలకు క్రిము, కీటకాలు నష్టం సంభవించినప్పుడు రైతులు అనేక క్రిమిసంహారక మందులు పొలాలకు వేస్తారని, వాడిన తర్వాత ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలను ఎక్కడ పెడితే అక్కడ విచ్చలవిడిగా పారేయకుండా గోతుల్లో పూడ్చాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని సింగన్న దొరపాలెం గ్రామంలో రైతులకు పొలాలలో ఖాళీ ప్లాస్టిక్ డబ్బాల విషయంపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో రైతులు ప్రతి పంటకు క్రిమిసంహారక మందులు అధికంగా వాడుతున్నారని, ఆ ఖాళీ డబ్బాలు ఎక్కడబడితే అక్కడ వెచ్చలవిడిగా వదిలేయడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఈ డబ్బాల వల్ల పశువులు, కుక్కలు, ఇతర జంతువులకు హాని కలగే ప్రమాదం ఉందన్నారు. ఖాళీ డబ్బాలను మడిలో చివరన ఒక గొయ్యి తవ్వి అందులో పాతిపెట్టాలని సూచించారు. ఇలా చేయడం వల్ల ఎవరికి ఎటువంటి హాని కలగదని, పర్యావరణ పరిక్షించుకోవడం కూడా జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నైరా కళాశాల విద్యార్థులు పుష్పమాంజలి పాత్ర, తేజస్విని, వందన, స్నేహలత, ఉమా, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేపై సమావేశం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం సమగ్ర భూ సర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారి జగన్నాథరావు మాట్లాడుతూ ఈ భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఉ ప్పవరం గ్రామ ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, రావి శోభన్ బాబు, వైఎల్ఎం మార్కెటింగ్ డైరెక్టర్ చందక శివ, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కె విమల నాయుడు సోమవారం ప్రారంభించారు. చలివేంద్రం ప్రారంభం రోజున మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుత విద్యాసంస్థల వ్యవస్థాపకులు పల్లి శేషగిరిరావు, అచ్చుతాపురం పంచాయతీ సెక్రటరీ అమ్మాజీ, గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక జీవిత బీమా కార్యాలయంలో ఏవోఐ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు ఆళ్ళి వేణు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బ్రాంచ్ మేనేజర్ ఉదయ్ సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ సాగర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఏఓఐ నాయకులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గొర్లి శంకర్రావు, సీనియర్ డివిజన్ నాయకులు పీల శ్రీనివాసరావు, కార్యదర్శి వెన్నెల సన్యాసిరావు, కోశాధికారి కరణం మాణిక్యాలరావు, రెసిడెన్షియల్ నిర్వాహకులు అయిత రాము, రొంగలి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- కశింకోట : గ్రామాల్లో అభివృద్ధికి సహకారం అందించడం జరుగుతుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి తెలిపారు. మండలంలోని 22 బోర్లు, 6 శ్మశానాల షెడ్లకు సంబంధించిన పనులు మంజూరు చేయగా, వాటికి సంబంధించి కశింకోటలో సోమవారం పరిశీలించారు. అంగన్వాడీ కార్యాలయ భవనం మంజూరు చేయమని కోరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. బాలసదనం స్థానిక యస్ఐ ఆదినారాయణ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విందును ఏర్పాటు చేశారు. దానిని సందర్శించిన ఎంపి అందులోని 45మంది పిల్లలకు స్వయంగా వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎమ్‌పిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు, పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ రైతులకు అన్యాయం జరిగితే ఉద్యమం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ భూములను తీసుకున్న రైతులకు అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని టిడిపి మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నిధులను పక్కదారి పట్టిస్తే గ్రామాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు దొడ్డి సూరిబాబు, మాజీ ఎంపిటిసి రాపేటి రాము, పచ్చి కూర రాము, బుద్ధ శంకర్రావు కోయిలాడ జగదీష్, ఆడారి నారాయణరావు శరగడం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుషిల్ డెకార్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని రుషిల్ డెకార్ ప్లైవుడ్ పరిశ్రమ ముఠా కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రుషిల్ డెకార్ ముఠా కార్మికులు పరిశ్రమ ఆవరణలో 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. సోమవారం ముఠా కార్మికులు ఎమ్మెల్యేను కలిశారు. ఆయన సమక్షంలో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇరుపక్షాలు తమ వాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఠా కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని యాజమాన్యంతో మాట్లాడి పూర్వ పద్ధతిలో పేమెంట్ చేసేలా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ చర్చల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, ఎస్ఇజెడ్ పునరావాస కాలనీ గ్రామ ఉప సర్పంచ్ రాజాన విజయ్, ఎంపిటిసి సభ్యుడు శ్రీను, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు హెచ్ఆర్ రమేష్, నాగేష్, ముఠా కార్మికులు సూరిబాబు, నానాజీ, అప్పలనాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రుషిల్ డెకార్ ముఠా కార్మికులు

మెగా పశువైద్య శిబిరం

పశువైద్య శిబిరం ప్రారంభంలో పాల్గొన్న కలెక్టర్ రవి

ప్రజాశక్తి- దేవరాపల్లి :మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా పశు వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 283 పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 74 పశువులకు జనరల్ మెడిసిన్ అందజేశారు. 68 పశువులకు గైనిక్ పరీక్షలు నిర్వహించారు. 11 పశువులకు సర్జరీ చేశారు. 2700 గొర్రెలు, మేకలకు, 130 లేగ దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు.

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి బి. ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పెయ్య దూడల పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేలు జాతి లింగ నిర్ధారణ వీర్యం ఉపయోగించడం ద్వారా పెయ్య దూడలను ఎక్కువ ఉత్పత్తి చేసి తద్వారా పాల దిగుబడి పెంపొందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశవాళీ ఆవులను పెంపొందించే దిశగా ఈ లింగ నిర్ధారణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ తదితర జాతుల లింగ నిర్ధారణ వీర్య నాళికలు అందుబాటులో ఉంచడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.లక్ష్మి, జెడ్పిటిసి కర్రి సత్యం, కె.కోటపాడు జెడ్పిటిసి ఈర్లే అనురాధ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు, ఎంపిటిసి రొంగలి నారాయణమ్మ, పోతల వెంకటరమణ, డిడి కరుణాకరరావు, పశుగణాభివృద్ధి అధికారి రామ్మోహన్ రావు, ఏడి బైరాగి, చిట్టిబాబు, వైద్యాధికారులు కె.మంజుషారాణి, జి.ప్రియాంక పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను పరిశీలించిన కలెక్టర్ రవి

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి, తారువ గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి సోమవారం పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ సమస్యలకు చెందిన 1977 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్ఎ సమయం దాటకుండా అర్జీదారునికి సమస్య పరిష్కారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జె సి ఎం జాహ్నవి, డి ఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.

చందనోత్సవ ఏర్పాట్లలో విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : సింహాచలం దేవస్థానం చందనోత్సవానికి ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందనిటిడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, బొత్స సత్యనారాయణ దగ్గరుండి కూడా భక్తులకు ఏర్పాట్లు కల్పించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. మంత్రులు ఆదాయం పైనే దృష్టి నిల్పారు గాని భక్తులకు సౌకర్యాలు అందించడంలో కనీసం శ్రద్ధ వహించలేదని స్వయంగా స్వామి స్వరూపానంద వెల్లడించారని పేర్కొన్నారు.

ఎస్‌పిని కలిసిన మహిళా పోలీసులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణను బుచ్చయ్యపేట మండలంలోని మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అనకాపల్లిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి సేవలను సక్రమంగా అందించి పోలీస్ డిపార్ట్మెంట్ సహాయకారిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు చట్టాలు, వారి హక్కులను తెలియజేయవలసిన బాధ్యత న్యాయవాదులపై ఉందని పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్ లో సోమవారం షిరిడి సాయి లా కళాశాల చెందిన 2020- 23 బ్యాచ్ న్యాయ శాస్త్ర విద్యార్థులకు సన్మానం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ సమాజంలో న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. పేదలకు న్యాయం అందించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీ సత్యవతిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకటరావు, ప్రిన్సిపాల్ శ్రీధర్, న్యాయ శాస్త్ర ఉపాధ్యాయులు భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సత్యవతికి మెమోంటో అందజేస్తున్న లా కాలేజీ ప్రతినిధులు

ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి- మునగపాక రూరల్

సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉండాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సోమవారం గ్రామసభ జరిగింది. ఎన్ఆర్ఈజీఎస్ పనితీరు, శానిటేషన్, గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పూర్తిచేసే దిశగా ప్రయత్నాలు జరగాలని వాలంటీర్లను, సచివాలయం సిబ్బందిని కోరారు. జగనన్న సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీ పరమేశ్వర్ల ఉత్సవాలు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట ఎల్బిపి అగ్రహారం గ్రామంలో గౌరీ పరమేశ్వర్ల ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. పూర్వకాలం నుండి దొండా వారి వంశస్థులు పాత మేడ వద్ద నాగుల చవితి రోజున గౌరీ పరమేశ్వరులను నెలకొల్పుతారు. సుమారు 6 మాసాలు పాటు గౌరీ పరమేశ్వరులకు దూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తారు. 2016 ఏప్రిల్ 11న ఈ ఉత్సవాలు నిర్వహించగా, మళ్లీ ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. నేల వేషాలు, బళ్లవేషాలు ప్రత్యేక అలంకరణంగా నిలిచాయి. సుమారు 16 బళ్ల వేషాలు వేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఇంటికి అధిక సంఖ్యలో బంధువులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. బాణ సంచా పెద్ద ఎత్తున కాల్చారు. ఎడ్ల పందేలు, వైజాగ్ వారిచే ఎగ్జిబిషన్ ప్రత్యేక అలంకరణగా నిలిచాయి. బుచ్చయ్యపేట ఎస్ఐ కుమార్ స్వామి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏటికొప్పాక గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు మామిడి సత్తిబాబు, అర్జున, అమ్మిడ అప్పలరాజు, నాగేసు, కాకర రమేష్, గోపాల అప్పలరాజు, బండి రాజు కుటుంబ సభ్యులు వైసిపిలో సోమవారం చేరారు. జెడ్పిటిసి సంధ్యా రాము ఆధ్వర్యంలో యలమంచిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరికి వైసిపి పార్టీ కండువాలను ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధి విధానాలు నచ్చి తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ పిళ్లా రమకుమారి, డిసిసిబి మాజీ ఛైర్మన్ తేజవర్మ, ఎంపిపి బోదెపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు కాలపరిమితి పెంపుపై 'అపుస్మా' హర్షం

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రైవేట్ పాఠశాలల రిక్గ్నిజేషన్ కాల పరిమితిని మూడేళ్ల నుండి నుండి ఎనిమిది సంవత్సరాలకి పెంపుదల చేయడం హర్షణీయమని "అపుస్మా" రాష్ట్ర చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు, రాష్ట్ర ఐటీ విభాగం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం అన్నారు. సోమవారం వారు స్థానిక అయ్యన్న స్కూల్లో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రిక్గ్నిజేషన్ కాల పరిమితిని పెంచారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్ కుమార్‌కు కృష్ణారెడ్డి, ఎంవి.రావు, డాక్టరు ఖాశీం, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు డాక్టరు శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంవి.సత్య నారాయణ, కోశాధికారి శేషగిరిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న అపుస్మా నాయకులు

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి

- పంచాయతీ రాజ్ దినోత్సవంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

- ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశంలో గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో సేవలు అందించిన ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జిఎస్‌విఎస్ ప్రత్యేక అధికారి మంజుల వాణి, డిఎల్‌డివో ఉదయశ్రీ, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచిన సర్పంచులను సత్కరించారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా నిలిచిన మార్టూరు సర్పంచ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపిపి గొర్లి సూరిబాబు, జెడ్పి వైస్ ఛైర్పర్సన్ బివి సత్యవతి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా పల్లెల ప్రగతి దిశగా వైసీపీ ప్రభుత్వ పాలన జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, వైస్ ఎంపీపీ అయిత ఆనందరాము, పంచాయతీరాజ్ డిఇఎల్ఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరవాడ : 2021-22 సంవత్సరానికి ఎస్డి జి థీమ్స్ సాధించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఎంపిడిఒ వేముల హేమసుందరరావు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం సచివాలయంలో సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవం జరిగింది. తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, పంచాయతీ కార్యదర్శి సోమినాయుడు, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, నూరాడ ముత్యాలరావు కణితి చినసోమేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని దేవరాపల్లి, మామిడిపల్లి, బోయిలుకింతాడ గ్రామాలలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, సర్పంచులు సబ్బవరపు పెంటమ్మ, బూరె బాబురావు, దేవరాపల్లి పంచాయతీ ఈవో ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి, బయ్యవరం గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి అవార్డులు రావడం పట్ల ఎంపిపి బోదెపు గోవిందరావు అభినందనలు తెలుపుతూ సోమవారం మండల పంచాయతీ కార్యాలయంలో అవార్డులు ప్రదానం చేశారు. ఎంపిడిఒ ప్రసాదరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీలుగా మండలంలో పద్మరాజుపేట ప్రథమ, బయ్యవరం ద్వితీయ, తురంగలపాలెం తృతీయ స్థానాల్లో నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో కొల్లి త్రినాథ్, సర్పంచులు, ఎంపిటిసీలు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డులు దక్కించుకున్న మండలంలోని చూచుకొండ, మల్లవరం గ్రామాల సర్పంచ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అవార్డులను అందజేశారు. మండల స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గణపర్తి, గొల్లలపాలెం, మడకపాలెం, మల్లవరం, నాగవరం, పి.ఆనందపురం, రాజుపేట, రామగిరి, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, వెంకటాపురం, ఒంపోలు గ్రామాల సర్పంచ్‌లకు మండల పరిషత్తు సమావేశ మందిరంలో అసిస్టెంట్ కలెక్టర్ దాత్రిరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి : పూర్తిస్థాయి మౌళిక వసతుల కల్పనలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన వెల్చూరు పంచాయతీ సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మకు కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆవార్డు, ప్రశంశా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగమ్మను ఎంపిటిసి నాగరాజు, వైసిపి నాయకులు జి.శ్రీనుబాబు అభినందించారు. పంచాయతీ సెక్రటరీ భవాని, చిల్లాడ చిన్న పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన ఉప్పవరం, జగ్గంపేట సర్పంచులను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో విజయలక్ష్మి, వైసిపి నాయకులు కోన లచ్చన్నాయుడు చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, సర్పంచులు సకల రాజేశ్వరి, దొడ్డి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట : ప్రజా సంక్షేమం కోసం పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందని ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు. స్థానిక మండల కేంద్రంలో జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు సంబంధించి తొమ్మిది విభాగాల్లో ప్రశంసా పత్రాలు అందుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, కోన అరుణ పాల్గొన్నారు.

మాడుగుల : మండలంలోని కింతలి వల్లాపురం గ్రామపంచాయతీ బాలల స్నేహ పూర్వక పంచాయతీ కేటగిరీలో ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయి అవార్డు లభించింది . స్వయం సమృద్ధి సాధించిన పంచాయతీలలో మాడుగుల, ఎంకోటపాడు,ఎం.కోడూరు ప్రథమ ద్వితీయ ద్వితీయ స్థానాలు పొందాయి. బాలల స్నేహపూర్వక పంచాయతీలలో కింతలి వల్లపురం, యం కోడూరు, సాగరం పరిశుభ్రమైన పంచాయతీలలో ఎంకోటపాడు,ఎం కె వల్లా పురం, వి జేపురం మహిళా స్నేహపూర్వక పంచాయతీలలో అవురువాడ, ఎం కోడూ,రు పోతనపూడి ఆరోగ్యకరమైన పంచాయతీలలో అవురువాడ కింత లి వల్లపురం, ఎం కోడూరు నీటి అభివృద్ధి గల పంచాయతీల కేటగిరిలో ఎం కోడూరు, కోటపాడు, వి జే పురం సామాజిక భద్రత కేటగిరిలో కింతలి, ఎంక్కష్ణాపురం, ఒమ్మలి, పేదరికం లేని పంచాయతీల కేటగిరిలో జంపెన, కింతలి, యంకోడూరు, సుపరిపాలన కలిగిన పంచాయతీలలో కేజేపురం, ఎం కోడూరు, ఎంకే వల్లపురం అవార్డులు సాధించాయి .ఆయా పంచాయతీలకు ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్టు మీనా కుమారి తెలిపారు.

నక్కపల్లి : పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా .9 విభాగాల్లో ఎంపికైన 27 మంది సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సర్పంచ్ ఎంపీటీసీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో.ఎంపిడిఒ సీతారామరాజు, ఇఓపిఆర్‌డి వెంకటనారాయణ , మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ ,వెలగా ఈశ్వరరావు ,పలువురు సర్పంచులు ,ఎంపీటీసీ సభ్యులు ,పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు.

కోటవురట్ల : మండలంలో పిప్పల కొత్తపల్లి గ్రామానికి సంక్షేమ పథకాల అమలులో జిల్లాస్థాయి పంచాయతీ పురస్కారం లభించింది. సోమవారం సర్పంచ్ యడగల బెన్నమ్మ జిల్లా కలెక్టర్ పఠాన్ శెట్టి నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, గ్రామ కార్యదర్శి రాజు ఉన్నారు.

రోలుగుంట : పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎన్.కొత్తూరులో ప్రజలకు నీరు సమృద్ధిగా అందించేందుకు కృషి చేసిన సర్పంచ్ సర్పంచ్ పోతలరాజు శేఖర్‌కు, బుచ్చింపేట సర్పంచ్ ఉలబాల చంద్రకు జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి శాలువతో సత్కరించి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిపిఒ శిరీషారాణి, ఈఓపిఆర్‌డి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

గొలుగొండ : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 13 గ్రామపంచాయతీలకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులు అందించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, ఈఒపిఆర్‌డి రఘురాం, పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్చూరు సర్పంచ్ మంగయ్యమ్మకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్

ఆక్రమిత దేవుని భూములను స్వాధీనం చేసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 115లో ఉన్న 23.15 ఎకరాల శ్రీరాములవారి దేవుని మాన్యం భూములను రెవెన్యూ రికార్డుల్లో 22ఎ1 (సి)లో నమోదు చేసి, ఆక్రమణదారుల నుండి దేవాదాయశాఖ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ భూములను శిస్తులకు దున్నుకున్న వ్యక్తులు వాటిపై హక్కులు కల్పించాలని 1999లో విశాఖ మున్సిపల్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించగా, చెల్లిబాటు కాదని వారి పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. 10(1) రికార్డుల్లోనూ, సెటిల్మెంట్ ఫెయిర్ అడంగల్లోనూ దేవుని భూమిగా నమోదైందని, అయినా ఆక్రమణదారులు రికార్డుల్లో వారి పేర్లను చేర్చుకొని అధికార పార్టీ పెద్దల అండదండలతో అమ్మేశారని తెలిపారు. ఈ భూములు అమ్మిన వ్యక్తులకుగాని, కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి గాని ఎటువంటి పాస్ పుస్తకాలు ఇవ్వరాదని అనకాపల్లి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ 2022 జూన్ 14న దేవరాపల్లి తహశీల్దార్‌కు లేఖ రాయగా, దాని ఆధారంగా తహశీల్దార్ రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఇప్పటికే మూడు సార్లు పాస్ పుస్తకాలు తిరస్కరించారని తెలిపారు. అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో, వారి సిబ్బందితో భూములు పరిశీలన చేసి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారని తెలిపారు. అన్ని ఆధారాలు ఉన్నా ఈ భూమిని స్వాధీనం చేసుకోవడంలో దేవదాయశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ముగ్గురు అసిస్టెంట్ కమిషనర్లను మార్చారని, దీన్ని బట్టి ఈ ఆక్రమిత భూముల వెనుక ఎటువంటి అధికార పార్టీ పెద్దలు ఉన్నారో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ భూములను వెంటనే స్వాధీనం చేసుకొని బోర్డులు పెట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పాలనపై ప్రజల్లోకి వెళ్లడం నిబద్ధతకు నిదర్శనం

ప్రజాశక్తి-చోడవరం : నాలుగేళ్ల పాలన తర్వాత ప్రజల్లోకి వెళ్లి తమ పనితీరు ఎలా ఉందో తెలుసుకోవడం అన్నది ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఈనెల 7వ తేదీ నుండి 29వ తేదీ వరకు మెగా సర్వే జరుగుతుందని, ఇందులో ప్రజల తమ అభిప్రాయాన్ని ప్రభుత్వంపై సానుకూలతను నిర్భయంగా తెలుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నేరుగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు నగదు బదిలీ వంటి కార్యక్రమాలు ప్రభుత్వంపై మంచి అభిప్రాయంతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో 4000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారని తెలిపారు.

గాంధీ గ్రామంలో గడపగడపకు..

మండలంలోని గాంధీ గ్రామంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎంపిపి గాడి కసులమ్మ, స్థానిక సర్పంచ్ అప్పారావు, వైస్ ఎంపిపి కుమారి ఈశ్వరరావు, బుచ్చియ్యపేట జడ్పిటిసి దొండ రాంబాబు, పులేటి వెంకటేష్, బొడ్డేటి సూర్యానారాయణ, సేనాపతి సత్యారావు, శ్యామల, ఒరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య, జి సత్యనారాయణ పాల్గొన్నారు.

రంగురాళ్లు తవ్వకాలపై పొంతన లేని మాటలు

రంగురాళ్ల తవ్వకాలపై నిఘాకు బేస్ క్యాంప్ ఇదే.. శిథిల తాటాకు షెడ్డు

◆ ఆనవాళ్లే లేవని అంటున్న అటవీశాఖ అధికారులు

◆ అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : గొలుగొండ మండలం సాలికమల్లవరంలో రంగు రాళ్ల తవ్వకాలపై అటవీశాఖ అధికారుల మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. రంగురాళ్ల క్వారీ వద్ద నిఘా పెట్టేందుకు తాటాకులతో ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు దీనికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిగా శిథిలావస్థలో, భయంకరంగా ఉన్న బేస్ క్యాంపు వద్ద అర్ధరాత్రి సమయంలో అటవీశాఖ అధికారులు ఏ విధంగా గస్తీ కాస్తున్నారో అర్థం కాలేదని పలువురు అంటున్నారు. గంటలపాటు తవ్వకాలు జరిగాయని స్థానికులు ఘంటాపథంగా చెబుతున్నారు. కొన్ని ట్రాక్టర్ల మట్టిని తరలించిన తర్వాత దానిని యధావిధిగా కప్పివేశారని మరి కొంతమంది చెబుతున్నారు. తవ్వకాలు జరిగిన ప్రాంతంలో కొలతలు వేశామని , ఎంతమేర గొయ్యి ఏర్పడిందో, అంత మట్టి అక్కడే ఉందని డిఎఫ్ఒ అంటున్నారు. జెసిబిని తీసుకువచ్చినప్పటికీ మట్టిని తవ్వలేదని, రంగు రాళ్లు బయటపడాలంటే సుమారు 20 నుంచి 30 అడుగులు లోతు అవ్వాలని, అంత లోతు వరకు ఇక్కడ తవ్వలేదని అంటున్నారు. క్వారీ నుండి లారీలు లేదా ఇతర వాహనాలు వెళ్లినట్లు ఎటువంటి ఆనవాళ్లు లేవని అంటున్నారు. అక్కడ బేస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో అసలు సిబ్బంది ఉంటున్న జాడలే లేవు. బేస్ క్యాంప్ నిర్వహణలో కూడా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. రంగురాళ్లు తవ్విన వారు చక్కగా క్వారీ దగ్గరే మద్యం తాగి, దర్జాగా రంగురాళ్లు తవ్వుకొని వెళ్లిపోయారని విమర్శలున్నాయి.. బేస్ క్యాంప్‌గా చెప్పుకొనే కమ్మల పాక చెదలు, తుప్పలతో నిండుకొని వుంది. బేస్ క్యాంప్ లో ఉండాల్సిన సిబ్బంది ఏమయ్యారనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. అటవీ శాఖ అధికారులు రంగు రాళ్ల క్వారీ వద్దకు వచ్చి అసలు తవ్వకాలు జరగలేదని చెప్పడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సందర్భంగా ఒత్తిడి తీవ్రమౌతున్న పరిస్థితుల్లో ఆ శాఖ ఉన్నతధికారులకు చెప్పడం కోసం ఒకరిద్దరు కింద స్థాయి అధికారులను సస్పెండ్ చేసి, మమ అనిపించుకోవాలని అధికారులు చూస్తున్నారని తెలుస్తోంది .మరోవైపు నియోజకవర్గంలో తవ్వకాల సంఘటన రాజకీయ రంగు పులుముకుంటోంది. తవ్వకందారులు బరితెగించారని, ఇందులో అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. రూ.15 కోట్ల విలువైన మట్టిని తరలించారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని అయ్యన్నపాత్రుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి లేటరైట్ దోచుకుంటుంటే, స్థానిక ఎమ్మెల్యే రంగురాళ్ళ మట్టిని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఘాటుగానే స్పందించారు. రంగురాళ్లలో ఒక్క రూపాయి సంపాదించినట్లు నిరూపించినా రాజకీయ సన్యాసం చేస్తానని ఎమ్మెల్యే సవాల్ విసురుతున్నారు. ఈ రంగు రాళ్లు తవ్వకాల వెనుక ఎవరి హస్తమున్నది అనేది తెలుసుకోవాలంటే ఉన్నతాధికారులచే దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

రంగురాళ్ల తవ్వకాలే జరగలేదు..

శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రంగు రాళ్ళ క్వారీలో గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలకు ప్రయత్నించారు. రాత్రిపూట గస్తీ తిరిగే సిబ్బంది రాకను గమనించి పారిపోయారు. నిర్లక్ష్యం వహించిన గస్తీ కాసే సిబ్బందిని సస్పెండ్ చేశాం. రంగురాళ్లు తవ్వి, వాహనాల్లో తరలించుకుపోయినట్లు ఎటువంటి ఆనవాళ్లు లేవు.

రాజారావు, డిఎఫ్ఒ, నర్సీపట్నం

ఆసరా సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి - రావికమతం: . ఆసరా పథకాన్ని డ్వాక్రా సంఘ సభ్యులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు కోరారు.. సోమవారం మండలంలో కవగుంట రామాలయం వద్ద డ్వాక్రా సంఘ సభ్యుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలులో భాగంగా జగన్ ప్రభుత్వంమంజూరు చేసిన ఆసరా ఆర్థికసాయంలో భాగంగా కవగుంట గ్రామపంచాయతీలో ఉన్న 22 సంఘాలకు గాను 19 సంఘాలకు ఆసరా పథకం వర్తించిందని, తొలి రెండు విడతల్లో రూ. 35 లక్షల 87 వేల 75 రూపాయలు రుణమాఫీ లబ్ధిని 253 మంది డ్వాక్రా మహిళలు పొందారన్నారు. లబ్ధి పొందడం జరిగిందన్నారు. మూడవ దఫాగా గ్రామపంచాయతీకి రూ.ఎనిమిది లక్షల 96 వేల 770లను సంఘాల పొదుపు ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. వివోఏ మహేష్, వార్డు మెంబర్లు పద్మ, వర కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

గడపగడపకూలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- మాడుగుల : ప్రభుత్వ పథకాలపై ప్రజలు సంతృప్తి గానే వున్నారని ఉప ముఖ్యమంత్రి బూ డి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని సాగరం వద్ద గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల గహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం తెలుసుకుని, మిస్డ్‌కాల్ ద్వారా అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లోని ప్రజలందరిని కలిసేందుకు వీలుగా జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఈనెల 29వ రకు పొడిగించారన్నారు.ఈ సందర్భంగా .సాగరంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు రూ.79 లక్షలతో జలజీవన్ మిషన్ పనులకు, ,గ్రామ అత్యవసర పనులు నిమిత్తం రూ.20 లక్షలు మంజూరు చేశారు. స్థానిక పాఠశాలలో రూ25 లక్షలతో నాడు నేడు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, జడ్పీటిసి రమణమ్మ,వైస్ ఎంపిపి కొత్తపల్లి శ్రీనివాస్, వైసిపి నేతలు గొల్లవిలి సంజీవరావు, పాము వెంకటరావు, బొమ్మిసెట్టి శ్రీనివాసరావు ,పడాల అప్పల నాయుడు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి

సీతారామరాజునగర్‌లో క్షీణించిన పారిశుద్ధ్యం!

తూతూమంత్రపు పనులతో మెరుగుపడని శుభ్రత అవస్థలు పడుతున్న ప్రజలు .. పట్టని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలోని సీతారామరాజు నగర్ గవర్నమెంట్ హాస్పటల్ ఎదురుగా ఉన్న రోడ్డు అపారిశుధ్యానికి శాశ్వత చిరునామాగా దర్శనమిస్తోంది, ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికికాలువలు నిత్యం పూడుకుపోయి దర్శనమిస్తూనే ఉంటాయి, పంచాయతీ సిబ్బంది మంగళవారం కాలువలు పూడిక తీసినా గానీ, మురుగు మాత్రం ఎటు కదలకుండా కాలువ నిండుగా అలాగే ఉంది. దీనిపై ప్రాంత వాసులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న తూతూ మంత్రంగానే కాలువలు శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో నిత్యం దుర్గంధం వెదజల్లుతూ, దోమలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తూతూమంత్రపు పూడికతీతతో ముందుకు కదలని మురుగునీరు

రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కొత్తకోట : రావికమతం మండలం కన్నంపేట గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంతో చేపట్టిన ఇంటింటికి తాగునీటి కుళాయి పనులలో భాగంగా రక్షిత తాగునీటి పథకం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ దంట్ల సత్యవతి సోమవారం శంకుస్థాపన చేశారు. .రూ. 50 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయనున్నారు. స్థానిక కనికలమ్మ ఆలయం సమీపంలో రక్షిత పథకం నిర్మాణానికి స్థలం కేటాయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులతో గ్రామంలోతాగునీటి కష్టాలు తీరనున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీను, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు!

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామ రెవెన్యూ సహాయకులు నిరంతరం గ్రామాల్లో ఉంటూ రెవెన్యూ సిబ్బందికి సహకరించకపోతే ఎలాగని డిప్యూటీ తహాశీల్దారు సోమశేఖర్ అన్నారు, సోమవారం గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతనాలు రెండు నెలలుగా అందకపోవడం పట్ల వారు తహాశీల్దార్‌ను కలిసి వేతనాల కొరకు వేడుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం భూసర్వే నిర్వహిస్తున్న సందర్భంలో సిబ్బందికి అందుబాటులో ఉండాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు, కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు..

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అన్నవరం, రామచంద్రపురం, గ్రామాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌వైద్య శిబిరం నిర్వహించారు, డాక్టర్ స్వర్ణ ప్రత్యూష ఆధ్వర్యంలో అన్నవరంలో 64 మంది, రామచంద్రపురంలో 61 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉపాధి కూలీలు రైతులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : జగన్మోహనరెడ్డి అధికారంలో వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు ఏటా జనవరిలో విడుదల చేస్తామన్న మెగా జాబ్ కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలని నర్సీపట్నం ఆర్‌డిఒ జయరామ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అడిగర్ల సతీష్, బోళెం శివ, పృధ్వీరాజ్, శివ, నాయుడు, జి.సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు చెప్పుల పంపిణీ

ప్రజాశక్తి -పాయకరావుపేట : పట్టణంలో సత్యసాయి 12వ ఆరాధన దినోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో 25 మంది రిక్షా కార్మికులకు చెప్పులు, టోపీలు పంపిణీ చేశారు. 150 మందికి పులిహోరా, మజ్జిగ వాటర్ ప్యాకెట్లు అందించారు. రోడ్డు పక్కన ఉన్న నిరాశ్రయులకు, వృద్ధులు, అనాధలు, పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి భజనమండలి కన్వీనర్ యజ్ఞవల్క్య శర్మ, సేవాదళ్ కోఆర్డినేటర్ రమణ రాజు రమేష్, సురపురాజు శ్రీలక్ష్మీపతి రాజు సాయి, సుధ, సాయి దీప్ వర్మ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం ఏఎల్ పురం సత్యసాయిమండలి ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి సీతారామరాజు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కేడిపేట ఎస్సై ఉపేంద్ర ప్రారంభించారు. అలాగే మజ్జిగ, పులిహోర కూడా అందజేశారు.కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ పి.సత్యనారాయణ, భజన మండలి కన్వీనర్ డి.శ్రీనివాసరావు, యూత్ లీడర్ జివి.రమణ, కుమారి, సేవాదళ్ సభ్యులు గాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-గొలుగొండ : వేసవిలో దొంగతనం జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర సూచించారు. సోమవారయి కేడిపేటలో ఆటో ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. కృష్ణదేవిపేట వారపు సంతతో పాటు పలు ప్రాంతాల్లో ఆటో ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ఆరుబయట నిద్రించే సమయంలో ఇళ్లకు తాళాలు వేసుకోవాలన్నారు. ఊరు విడిచి వెళితే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా అనుమానిత, అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కృష్ణవేణి

రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో బంగారు పతకం సాధించిన కృష్ణవేణి

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ఈ నెల 22,23 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ టోర్నమెంట్‌లో కొలుకుల కృష్ణవేణి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందని నర్సీపట్నం నింజాస్ స్పోర్ట్స్ అకాడమీ వూషఉ కోచ్ వై.శేఖర్ సోమవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా వూషు అసోసియేషన్ జిల్లా కోచ్, నేషనల్ రిఫరీ వెంకట్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడాకారులను నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, సెక్రటరీ వెలగా జగన్నాధ్, డైరెక్టర్స్ పారుపల్లి శ్రీనివాస్, సుతాపల్లి బ్రదర్స్ శ్రీకాంత్, శ్రావణ్, ప్రముఖ సైకాలజిస్ట్ పి. శ్రీసుమ, డైరెక్టర్స్ బోలేం శివ, అడిగర్ల సతీష్, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వెలుగు అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్‌పై సోమవారం జిల్లా స్థాయిలో అవగాహన కల్పించారు. 12 మండలాలకు చెందిన ఎపిఎం లు ,సిసి, మండలానికి ఇద్దరు చొప్పున విఒఎలకు లోకోస్ యాప్ పై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకత కోసం పారదర్శకత, జాతీయ ప్రమాణం జీవనోపాధుల పథకం కింద అమలవుతున్న ప్రభుత్వ పథకాలు అన్నీ లోకోస్ యాప్ కిందకు తీసుకురావాలన్నారు . మహిళా సంఘాలు తీసుకొన్న అన్ని రకాల లావాదేవీలు, రుణాలు , రికవరీ వివరాలు, ఆర్థిక కార్యక్రములు లోకోస్ యాప్ ద్వారా నిర్వహించాలని సూచించారు. మూడు రోజులపాటు ఈ శిక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఎపిఎం చంద్రకళ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రంగురాళ్ల తవ్వకాలు'

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ : సాలికమల్లవరం రిజర్ ఫారెస్ట్‌లో రంగురాళ్ల క్వారీలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయని గొలుగొండ మాజీ జెడ్పిటిసి తారక వేణుగోపాల్, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఆరోపించారు. గతంలో ఇటువంటి పనులు చేసి రూ.పదివేల జరిమానా కట్టి జెసిబి టిప్పర్‌లో పట్టుకెళ్ళిన సన్నివేశాలు గుర్తు తెచ్చుకోవాలన్నారు గొలుగొండలో వైస్ ఎంపిపి భర్త దీనికి ప్రధాన సూత్రదారుడని, ఆయన సెల్‌ఫోన్ డేటాను పరిశీలిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. . టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు..కార్యక్రమంలో చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్, నర్సీపట్నం టీడీపీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రమణ పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై పోరాటం

బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-చోడవరం : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎట్టున పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వ, ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ప్రచార భేరి సందర్భంగా సోమవారం చోడవరం నుకాంబిక కళ్యాణ మండపంలో బహిరంగ సభ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని విమర్శించారు. రానున్న కాలంలో బిజెపికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కరువైపోతున్న ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కిల్లి లక్ష్మయ్య, సీత బ్రహ్మానాయుడు, కన్నబాబు, కనకమహాలక్ష్మి, నాగూరు, గుప్తా, కాంతం, దేవి, సిరసపల్లి సూరిబాబు, ఎస్‌వి.నాయుడు, డి.వెంకన్న పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న వెంకటరమణ, వేదికపై ప్రభావతి

ముమ్మరంగా ప్రచారభేరి పాదయాత్రలు

గొలుగొండలో..

గొలుగొండ : ప్రజల, ప్రభుత్వాల ఆస్తులను కాపాడలేని ప్రభుత్వాలు మాకొద్దని వామపక్ష పార్టీల నేతలు స్పష్టం చేశారు. సోమవారం గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం, రాజపేట, గుండుపాల గ్రామాలలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఓటర్లను మాయమాటలతో గద్దెకెక్కిన మంత్రులు, ప్రధాని మళ్లీ పదవుల కోసం దేశ సంపదను అమ్మడం, తాకట్టు పెట్టి ఓట్ల కోసం అనవసరమైన పథకాలు పెట్టి ఆర్థిక పరిస్థితులను దిగజారే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో విద్యార్థి యువజనలు, మేధావులు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఏఐటియుసి జిల్లా నాయకులు ఎల్‌వి. రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు జి గురుబాబు, సీపీఐ మండల కార్యదర్శులు మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామమూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు జి.రాధాకృష్ణశెట్టి, పైడియ్య, పైల మాణిక్యం, లోకవరపు అప్పలనాయుడు, శెట్టి రాజబాబు పాల్గొన్నారు.

మధురవాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న వినాశకర విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని సిపిఐ, సిపిఎం మధురవాడ జోన్ కమిటీలు పిలుపునిచ్చాయి. జివిఎంసి 5వ వార్డు పరిధి శారదానగర్‌లో సోమవారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, వి.సత్యనారాయణ, బి.భారతి, వి.సన్నిపాత్రుడు, కుమార్, కె.సుజాత పాల్గొన్నారు.

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సప్తగిరినగర్, సుజాతనగర్ ఎ.జోన్, బి.జోన్, గోపాలకృష్ణనగర్, ఆంజనేయులునగర్, పాపయ్యరాజుపాలెం పెట్రోల్ బంక్ బ్యాక్ ప్రాంతాల్లో ప్రచారభేరి నిర్వహించారు. సిపిఎం, సిపిఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ విధానాలతో కలుగుతున్న నష్టాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీచేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు ఎ.రమణ, ఎం.రాము, సిఐటియు నాయకులు అప్పలనాయుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీల నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు ఎం.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే ప్రయతాన్ని విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, ఎ.లోకేష్, వై.నందన్న పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : సిపిఐ ఆధ్వర్యంలో 15వ వార్డు అంబేద్కర్ నగర్, డాక్టర్స్ కాలనీ, హిల్‌వేవ్ గార్డెన్స్ ప్రాంతాల్లో ప్రచారభేరి నిర్వహించారు.ఎన్.మధురెడ్డి. అడ్డూరి శంకర్, దారపు లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రచార భేరిలో భాగంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 26న సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి నాయకులు కోరారు. ఈ మేరకు 18వ వార్డు అంజయ్య నగర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు ఎం.చంటి, మౌనిక, పొన్నాడ శ్రీను, దుర్గా, పొన్నాడ శ్రావణి, నూకాలమ్మ, భాస్కరరావు, వెన్ని లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనబాబు తెలిపారు. మండలంలోని ఎ.కోడూరు, పాతవలస, గొట్లం గ్రామాలలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీలు, పెట్రోలు, గ్యాస్ ధరలు భారీగా పెరుగుతున్నా రాష్ట్రంలో అధికార వైపిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని తెలపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు, మనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి : మండలంలోని గోవిందపాలెం గ్రామం సిపిఎం ప్రచార భేరి చేపట్టారు. గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను సిపిఎం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి.దేముడు నాయుడు, పి.మాణిఖ్యం మాట్లాడుతూ, ఉపాధి హామీకి కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో భారీ కోత విధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.లక్ష్మి, సిహెచ్.పవన్ కుమార్, కె.రాంబాబు, కె.నాగబాబు, సిహెచ్.నూకన్న, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

28న బహిరంగ సభను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ 28న శుక్రవారం అచ్యుతాపురంలో జరగనున్న బహిరంగ సభకు అత్యధిక సంఖ్యలో కూలీలు, కార్మికులు, రైతులు తరలిరావాలని సిపిఎం సీనియర్ నాయకులు బద్ద రంగారావు, కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని కొండకర్ల, అందలాపల్లి గ్రామాల్లో సోమవారం ప్రచార భేరి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీలను కలిసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉపాధి కూలీలకు ఇచ్చే సదుపాయాలు నేడు బిజెపి అధికారం రద్దు చేస్తుందని తెలిపారు.

అచ్యుతాపురంలో...

పెందుర్తిలో...

మధురవాడలో...

అంజయ్యనగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి కోటవురట్ల: మండల కేంద్రంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపిడిఒ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు, కార్యక్రమానికి హాజరైన జెడ్‌పిటిసి సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. తద్వారా గ్రామాల్లో సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుండి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ఈ ఓ పి ఆర్ డి ప్రేమ్ కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో నిర్వహిస్తున్న ర్యాలీ